# అనగనగా... ఒక కథ

## హరిలో రంగ హరి...

మంచు తెరచాటునే ఆగి ఇంకొంచెంసేపు గ్రామీణ సౌందర్యాన్ని ఆస్వాదిద్దామని, సూర్యుడు గ్రామం నలుమూలలా చల్లటి కళ్లు అర తెరచి చూస్తున్నాడు.

ఎత్తైన ఆలయగోపురం నుంచి చూస్తే స్పష్టాస్పష్టంగా కనిపిస్తోంది గ్రామసౌందర్యం-దిట్టమైన పెంకుటిళ్ల మధ్యలో కుడిఎడమల వరసల్ని కలగలిపే తివాచీలా రంగుల ముగ్గులు అల్లుకుని మురిపిస్తున్నాయి.

'అయ్యో...ఈ మంచు రాక్షసి ముగ్గుల మీద మళ్లీ కల్లాపి చల్లేస్తుందేమో' అనుకున్నాడు సూర్యుడు- ముగ్గులు కనిపిస్తున్నంత మేర ఆతప ఆతపత్రాన్ని నేత్ర విస్ఫారితంతో పరచాడు- మంచు పొలిమేరకి పరిగెడుతూ చెట్ల ఆకుల సందుల్లోంచి సూర్యుణ్ని ఈర్ష్యగా చూస్తూ రుసరుసా గొణుక్కుంటున్న గుసగుసల సవ్వడికి పక్షులు మేల్కొని కిలకిలా నవ్వడం మొదలెట్టాయి. ఆ నవ్వుకి మంచు సిగ్గుతో చితికి చినుకులై విరుస్తున్న పూలరేకుల మీద చెల్లాచెదరుగా పడి, పూపూజతో తరించాయి.

సూర్యుడికే పులకింత తెప్పించింది. తన కిరణ చమత్కృతితో ఆకృతిదాల్చి శోభిస్తున్న ప్రకృతి-

"మంచుతో దోబూచులింకెంత సేపురా...
పంచగా వెలుగులా రారా ప్రభాకరా...
కల్ల కపటము లేని మాపల్లె వాసులా...
చల్లగా దయచూడ కదలిరా భాస్కరా.."

తంబురానాదంతో భూపాల రాగం పిలుపు వినపడగానే సూర్యుడు రిక్కించిన కర్ణకిరణం...హరిదాసు తలమీదున్న తిరుచూర్ణాలంకృతమైన రాగి గుమ్మడిపాత్రలో పిడికెడు వెలుగుల తొలి భిక్ష వేసింది-

హరిదాసు గాత్రం పులకిత గమకాల్తో సంకీర్తనం చేస్తూ... గ్రామప్రదక్షిణం చేసింది- రామదాసు, అన్నమయ్య, త్యాగయ్య కీర్తనల ఆశీర్వాదాల్తో పల్లెకి మేలుకొలుపులు పాడింది.

తెల తెల వారుతుండగా గ్రామం నలుమూలలా తిరిగి సంకీర్తన చేసి పదిగంటల వేళ పునరాగమనం చేస్తాడు- అప్పుడే భిక్ష స్వీకరణ చేసి 'కృష్ణార్పణం' అంటాడు హరిదాసు- కంచుఘంటలాంటి కంఠంతో అతను పాడే పాట వినాలని...నిలబెట్టి పాటకి పులకించి.. పూర్తయ్యాక, దోసెడు బియ్యం-పళ్లూ (పదిపైసలో పావలానో) దక్షిణా సమర్పించి..అతని చేత 'కృష్ణార్పణం' అనిపించుకునే సమయానికి....అతను బిక్షగాడు కాదు అనీ..తాము వేసింది భిక్ష కాదనీ...గుళ్లో దేవుడికి ఇచ్చిన నైవేద్యమే అది-అనే భావన కలుగుతుంది- అప్రయత్నంగా దణ్ణం పెట్టేస్తారు. చిన్నా పెద్దా ఆడంగులంతా- భక్తి ప్రేరణ కలిగించే గాన మాధురి ఆ హరిదాసుకి అబ్బింది.

బక్కపల్చగా..చామన ఛాయకన్నా ఛాయ తక్కువగా..పీలగా కనిపించే...అతనా పీతాంబరం కట్టి, కనకాంబరాల దండల్తో కంఠాన్ని ముంజేతుల్నీ, అలంకరించుకుని...తులసిమాలల్తో, తిరుచూర్ణాల్తో, గుమ్మం ముందు.. హరి సంకీర్తనం చేస్తూ చిందేస్తూ తంబురా నాదం చేస్తుంటే, నారదుల వారేమోనన్నంత గౌరవం కలుగుతుంది. 'ముప్పై ముప్పయిదేళ్ల ఈ కుర్రాడిలో ఇంత గాత్ర గాంభీర్యం ఉండటం దైవలీలే' అనిపిస్తుంది పెద్దముత్తయిదువులకి-పిల్లలకి..'దేవుడు పాటయినా బాగా పాడుతున్నాడ్రా' బాబూ...అని వినాలనిపిస్తుంది-ధనుర్మాసం నెల్లాళ్లూ..పదకొండు నెలల పాటు గుర్తుండే నిత్యోత్సవంగా ఊరు సింగారించుకుంటే...ఈ హరిదాసు పాటతో ప్రతీరోజూ మంగళ స్వరాలతో మొదలౌతుంది.

వసంతరుతువు తెరచాటు కెళ్లగానే కోకిల పాత్ర కనుమరుగైనట్లే ధనుర్మాసం ముగియగానే హరిదాసు గాత్రం వినకరువౌతుంది- ఏడాది పొడుగూ ఆ పాత్రలూ ఈ గానాలూ కొనసాగితే ఎంత బావుండేది? నిత్యం పండగైతే అసలీ ఆనందమాధుర్యం ఉండదని దేవుడీ చలన చిత్రానికి మధ్య మధ్య పాటల సమయాన్నిచ్చాడా అనిపిస్తుంది!

ఇంతకీ ఈ హరిదాసు...పేరే...హరిదాసా? ఎప్పుడూ ఈ వేషంలోనే ఉంటాడా? వేషం తీసేశాక ఏం చేస్తాడూ?

అసలు పేరేంటి? ఎక్కడుంటాడూ..??

ఈ ప్రశ్నలు మనం వేసుకోం- జవాబూ కనుక్కోం- కదూ?

కానీ...పండగ సెలవులకి పట్నం నుంచి మావయ్య ఇంటికొచ్చిన సుధాకర్‌కి ఈ ప్రశ్నలకి జవాబు తెల్సుకోవాలని బలంగా అనిపించింది.

కొన్నాళ్ళు వేకువ ఝాము దుప్పటీ ముసుగులోంచే పాట వినపడ్డం మొదలైన నుంచి...తమ వీధి దాటి దూరంగా..వెళ్లిపోయి పాట వినపడనంత సేపూ చెవులు రిక్కించేవాడు..వినగా..వినగా..అతని కూడా నడవాలనిపించినా...పట్నం భేషజానికి బిడియపడి పడుకునే వుండేవాడు సుధాకర్.

పదిగంటల వేళ నిద్రలేచి హరిదాసు పారవశ్యగానాన్నీ-చిరుచిందుల్లో అందెల గతుల్లో-చే చిడతల లయల్నీ గమనించేవాడు.

మావయ్య కూతురు నడక కులుకులకన్నా-పలుకు తేనెల కన్నా-పైట గాలులకన్నా మనోహరంగా అనిపించింది హరిదాసు సందర్శనం.

కానీ మెచ్చుకోకూడదు. తను పట్నం మనిషి అన్న బింకంతో ఉన్నాడు సుధాకర్.

"బాగా పాడతాడు..మీ వూళ్లో మంచి గొంతున్న యాచకులున్నారే" అన్నాడు మావయ్యతో.

"ఆయన్ని 'యాచకుడు' అనరు- 'హరిదాసు' అంటారు." బుస్సుమంటూ జవాబిచ్చింది మరదలు మంజులత.

"ఇట్సోకే...బట్..హి ఈజ్ బెగ్గింగ్"

"నో..హి ఈజ్..టేకింగ్-అండ్ గివింగ్ అజ్ బ్లెస్సింగ్స్"

"యస్ అఫ్‌కోర్స్...బట్.." ఏదో చెప్పబోతుండగా మంజులత కాఫీ కప్పులు తీసుకుని బారెడు జడ విసురుగా విదిలిస్తూ లోపలికెళ్లిపోయింది!

నవ్వు నటిస్తూ.."మావయ్యా లైబ్రెరీదాకా వెళ్లొస్తా" అని బైల్దేరాడు.

హరిదాసు పాట వెనకాలే నడక- అతనాగితే కొంతదూరంలో ఏదో పనున్నట్లు ఆగటం-ఇంచుమించు అతను తిరిగిన వూరంతా తిరిగాడు.

ఇంత గొంతు చించుకుని-ఊరంతా తిరిగి చిందులేసి, ఇతను సంపాదించే గిన్నెడు బియ్యం అతని కుటుంబానికి సరిపోతాయా? ఒకవేళ ఆరోజుకి కడుపునింపినా ఈ నెల తర్వాత వాళ్లేం తింటారు-అడుక్కునే వాళ్లని సోమరిపోతులని నిందించే సుధాకర్‌లో కొత్తగా ఏదో మార్పు కలిగింది. అందుకే...ఆ గొంతుపై భక్తి, అతనిపై ఆసక్తి, ఆర్తి- తిరిగి తిరిగి హరిదాసు గ్రామపంచాయతీ వాళ్ల బాటసారి సత్రానికి వచ్చాడు. సత్రవంటే సత్రవుకాదు. ఎండావానా వచ్చినప్పుడు అటూ ఇటూ వెళ్లే బాటసారుల కోసం ఏర్పాటు చేసిన సిమెంట్ రేకుల షెడ్డు అది. సంతలకి చిన్నపాటి సరుకుతెచ్చి అమ్ముకునేవాళ్లు- ఓపికలేని బిచ్చగాళ్లు-పూసలాళ్లు, సోదెమ్మలూ, గంగిరెద్దులోళ్లూ, బుడబుక్కలోళ్లూ, జంగమాళ్లూ షెడ్డు చుట్టూ ఉన్న వరండాల్లో మూటాముల్లీ పెట్టుకునుంటారు. వాళ్లున్నంత సేపూ ఆ జాగా వాళ్లది- చెరువుగట్టునానుకునే వుంది గనక స్నానపానాలకి లోటు లేదు.

చుట్టూ వున్న చెట్ల క్రింద మూడు ఇటికలు పేర్చిన పొయ్యిల్లాంటివి చాలా వున్నాయి. గిన్నీ తపేళా వున్నవాళ్లు. రాలిన ఆకులూ ఎండిన చితుకులూ తుక్కు కాయితాలూ మంటేసి కావాల్సింది వొండుకుని తింటారు.

ఈ జనాన్ని దాటుకుని షెడ్డులోపలికెళ్తే ఒకే ఒక్క తలుపున్న గది-లోపల కూడా మళ్లీ వరండాలూ...దాన్నిండా అనామకాశ్రితులూ వాళ్ల మూటలూ-

ఆ తలుపున్న గది...నెల పొడుగూ బసవుండే పగటివేషగాళ్లకీ...ఇలాంటి హరిదాసులకీ ఇస్తారు-మునసబుగారి అనుమతితో.

అదిగో హరిదాసు ఆ గదిలోకెళ్లాడు.

దూరం నుంచే చూస్తున్న సుధాకర్‌కి ఈ డ్రస్‌తో లోపలికెళ్లడానికి మొహమాటం వేసింది. అహం అడ్డొచ్చింది.

బైటే సిగరెట్లు తగలేస్తూ కాలవలో ఇటూ అటూ తిరుగుతూన్న బల్లకట్టు దిగేవాళ్లనీ ఎక్కేవాళ్లనీ కాకి లెక్కలేస్తున్నాడు.

మనిషి అయితే బైట ఉన్నాడు గానీ..చూపైతే కాలవ వైపు ఉందిగానీ..దృష్టి అంతా 'హరిదాసు' వెళ్లిన గదివైపే వుంది. అరగంటైంది. హరిదాసు రాలేదు.

పడుకున్నాడో-వొండుకు తింటున్నాడో అనుకుంటుండగా...

మనకబారిన తెల్లటి కట్‌బనీను, గళ్లలుంగీ అడ్డకట్టుతో, భుజంపై తువ్వాలు-నోట్లో కాలుస్తున్న బీడీతో ఒక వ్యక్తి బైటకొచ్చాడు.

అతనే ఇందాకటి 'హరిదాసు' అని పోల్చుకోవటానికి సుధాకర్‌కి కొన్ని క్షణాలు పట్టింది! మేకప్ తుడిచినా..పూర్తిగా పోని ఊర్ధ్వపుండ్రాలూ, బుజాలపై తిరునామాలూ కాళ్ల పారాణి మచ్చల్లా కనిపిస్తున్నాయి..అందుకు గుర్తుపట్టగలిగాడు.

సంతకొచ్చిన పూసలమ్మ దగ్గర పావలాబెట్టి రూపాయి నోటంత నబ్బుబిళ్ల కొన్నాడు అతను.

సరాసరి కాలవకేసి దిగుతుండగా సుధాకర్ తెగించి మాట్లాడాడు.

"మీరు ఇందాకా ఊళ్లొకొచ్చిన హరిదాసుగారు కదూ!" గౌరవంగా అతను పలకరించగానే..కాలుస్తున్న బీడీని వెనక్కి దాచి విసిరేశాడు హరిదాసు.

"అవున్నేగోరూ..తవరూ?" ఎవరన్నట్లు అడిగాడు.

"నేను హెడ్మాస్టారి మేనల్లుణ్నిలెండి..పండక్కొచ్చాను. మీ పాట విన్నాను. చాలా బాగా పాడారు" అన్నాడు సుధాకర్.

"నా మొగవండి బాబూ-నాదేం పాటండీ? మా తాతా మా నాయినా పాడతావుంటే..ఓ బ్రెమ్మరథం పొట్టేవారండి..సంగీతం నేర్పమని ఈ పూరోళ్లంతా ఎంబడించే వోళ్లంటే నమ్మండి- మనదంతా ఇనికిడి బాపతు ఇద్యండి-వాళ్లది నిజమైన 'ఇది' అనమాటండి"

అంత స్పష్టంగా...అక్షరం తప్పులేకుండా...అంత పెద్ద పెద్ద సంస్కృత కీర్తనలు పాడిన ఇతను ఇలాంటి భాష మాట్లాడుతున్నాడేంటి? సుధాకర్‌కి అంతుపట్టలేని ఆశ్చర్యం కలిగింది.

"హరిదాసుగారూ...అంత బాగా రాగం, తాళం, పదం భావం స్పష్టంగా పాడిన మీరు..ఈ భాషలో మాట్లాడుతున్నారు"

"ఓర్నాయనో...కరెక్టుగా పట్టేసినారండి-కానండీ..నేనెప్పాను కదాండీ..అది నేను నేర్చుకున్న పాటండి..ఇది నాకొచ్చిన బాసండి-అంటేండీ..ఆడ పాడింది హరిదాసండి- ఈడ మాటాడేది కోటేశుగాడండి!"

సుధాకర్‌కి మాట రావట్లేదు.

అతగాడు పక్కపట్నంలో డాక్టరుగారి డ్రైవరుగా పనిచేస్తాడుట. అతను చేస్తున్న ఉద్యోగానికి నెల్లాళ్లు సెలవుపెట్టి వచ్చాడుట- ఈ నెల జీతం నష్టానికి సెలవుపెట్టినా...తాతతండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన తంబూరా..రాగి గిన్నె అతను వినియోగిస్తూ నాలుగు తరాలుగా వాళ్ల కుటుంబాన్ని నడిపించిన ఈ గ్రామంలో హరిదాసుగా సంకీర్తనం చేస్తే పెద్దల ఋణం తీర్చుకున్నట్లే కోటేశు భావిస్తాడుట- సుధాకర్‌కి అతని సెంటిమెంట్ చిత్రంగానూ కమిట్‌మెంట్ విచిత్రంగానూ అనిపించింది. కీర్తనలూ-కృష్ణార్పణం అనే మాట తప్ప అతను ఏ మాటా ఎందుకు మాట్లాడడో బాగా అర్థం అయింది.

★ ★ ★

సంక్రాంతి రోజు తలమీద రాగి గిన్నెలు ఒకదాని మీద ఒకటి పెట్టి..మరింత ఉత్సాహంగా చిందేస్తూ- కొత్తకీర్తనలు పాడుతూ గ్రామ సంచారం చేశాడు. ఆరోజు ఆఖరిరోజు-మంగళప్రధానంగా సాగే ఆ పాటలు ఏడాది పొడుగూ వినిపించే గీతాల్లా భావిస్తూ..రోజూలా దోసెడు బియ్యం కాక పళ్లెం నిండా బియ్యం..కూరగాయలూ పప్పూ ఉప్పుతో బాటు సమస్త స్వయంపాక సరంజామాని సమర్పిస్తారు జనం. అందుకే ఆరోజు హరిదాసు వెంట ఇద్దరు వ్యక్తులు కావళ్లు వేసుకుని వచ్చారు వాటిని సత్రవ దాకా మోసే పనికి- సంక్రాంతి సాయంత్రం పంచాయతీ సత్రవ పెరట్లో గాడిపొయ్యి తవ్వి వంట చేశాడు కోటేశు ప్రతీ ఏడాది లాగే! ఈ నెల్లాళ్లు భిక్షగా వచ్చిన బియ్యాన్నీ మిగిలిన సమస్తాన్నీ పెట్టి పేదసాదలకి విందు చేశాడు! సంక్రాంతి సంతర్పణతో పెద్దలు తరిస్తారనిట!

మర్నాడు అతను బైల్దేరి వెళ్లిపోతూంటే...సుధాకర్ చూశాడు..తంబురా..రాగి గిన్నెలూ...పీతాంబరాలు..కట్టుబట్టలూ..కనిపిస్తున్నాయి. కంటికి కనిపించనిది ఒకటుంది. అది అతని ఆత్మసంతృప్తి..సుధాకర్ అతనికి మనస్సులో నమస్కరించి 'కృష్ణార్పణం' అనుకున్నాడు. ✻

